మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



## దక్షిణ తెలంగాణ కేంద్ర బిందువు

# మహబూబ్‌నగర్



మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజ నర్సింహా

**మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని**

**సూపర్ స్పెషాలిటీ రిఫరల్ ఆసుపత్రిగా**

**అభివృద్ధి : రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి**

**దామోదర రాజ నర్సింహా**

**ప్రజా పాలన ప్రగతి పాలన ఆరోగ్య అవగాహన**

**వారోత్సవాల లో భాగంగా**

**మెగా రక్త దాన శిబిరం ప్రారంభం**

**పాల్గొన్న విప్ యెన్నం, మేయర్ మమత**

**మహబూబ్‌నగర్ బ్యూరో ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** మహబూబ్ నగర్‌లో మెడికల్ సేవలు, విద్యాప్రమాణాల పెంపుపై ప్రభుత్వ దృష్టి సారించినట్లు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ఈ నెల 6 నుంచి 11 వరకు నిర్వహిస్తున్న ఆరోగ్య అవగాహన వారోత్సవాలలో భాగంగా మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న స్వచ్ఛంద మెగా రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయుష్, హోమియోపతి, యునాని వైద్య శాఖల ద్వారా ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. అనంతరం మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను, మెడికల్ కాలేజీలో, నర్సింగ్ కాలేజీలో వైద్య ఆరోగ్యశాఖ ద్వారా కావలసిన మౌలిక సౌకర్యాల కల్పన, సమస్యలు గురించి వారి నుండి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజ నర్సింహా మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాను దక్షిణ తెలంగాణ వైద్య రంగానికి కేంద్రంగా సూపర్ స్పెషాలిటీ సేవలతో రిఫరల్ ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. మెడికల్ కాలేజ్‌లో సీట్ల పెంపు, పీజీ కోర్సుల విస్తరణ, విద్యార్థులకు వేర్వేరు హాస్టల్ సదుపాయాలు, ఆడిటోరియం నిర్మాణం వంటి అంశాలను ప్రాధాన్యతగా తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కొత్త టీచింగ్ హాస్పిటల్ భవనం పనులు త్వరలో పూర్తిచేసి, జూన్ నెలలో ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే, టీచింగ్ హాస్పిటల్ ప్రారంభంతో పాటు హాస్టల్స్ భవనం ఆడిటోరియం నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మెడికల్ కాలేజ్ మరియు ఆసుపత్రికి అవసరమైన అదనపు మౌలిక సదుపాయాలను ప్రభుత్వం పూర్తిగా సమకూర్చుతుందని స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్‌ను సూపర్ స్పెషాలిటీ మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేయడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దక్షిణ తెలంగాణలోని నారాయణపేట్, వనపర్తి, గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాలకు మహబూబ్‌నగర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ రిఫరల్ సెంటర్‌గా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ఎంఆర్ఐ వంటి ఆధునిక వైద్య సదుపాయాలను స్థానికంగా అందుబాటులోకి తీసుకురావడం, సర్జరీలకు రోబోటిక్స్ వైద్య పరికరాలు, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్, ఆర్గన్ ట్రాన్స్‌ప్లాంట్ రిట్రీవల్ సెంటర్, వాస్క్యులర్ యాక్సెస్ సెంటర్ వంటి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. అలాగే, మెడికల్ కాలేజ్‌లో ప్రస్తుతం ఉన్న 21 విభాగాలకు అదనంగా మరో 14 డిపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేసి, హైదరాబాద్ లోని ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకు దీటుగా అభివృద్ధి చేస్తామని అన్నారు. ముఖ్యంగా సర్జికల్ విభాగాలను బలోపేతం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. టీచింగ్ ఫ్యాకల్టీ కొరతను తీర్చేందుకు భారీగా నియామకాలు చేపడుతున్నామని, 607 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియ చేపట్టినట్లు ఇప్పటికే 172 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల నియామక ఉత్తర్వులు ఇచ్చామని తెలిపారు. ప్రొఫెసర్ ఖాళీలను ప్రమోషన్ ద్వారా భర్తీ చేస్తామని తెలిపారు. 2232 నర్సులను రాష్ట్రంలో కొత్తగా నియామకం చేస్తున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలో ఉన్న 100 నుండి 150 పడకల సెకండరీ ఆసుపత్రులను కూడా బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని తెలిపారు. ప్రతి 30 నుండి 35 కిలోమీటర్ల పరిధిలో థర్డ్ లెవెల్ ట్రామా కేర్ సెంటర్లను, ప్రతి 25 కిలోమీటర్ల పరిధిలో ఒక డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు, విద్యార్థులకు మెరుగైన మెడికల్ ఎడ్యుకేషన్ అందించడంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. తర్వాత ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో పోస్ట్ ఆపరేటివ్ వార్డ్ ను సందర్శించి రోగులతో మాట్లాడి వైద్య సేవలు, చికిత్స గురించి తెలుసుకున్నారు. మహబూబ్‌నగర్ ప్రాంతంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కింద చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రశంసనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆసుపత్రుల అభివృద్ధి, అవసరమైన మానవ వనరుల సమీకరణలో వైద్య ఆరోగ్య శాఖా మంత్రి తీసుకుంటున్న చర్యలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాంతంలో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న వైద్య సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన ప్రణాళికలతో ముందుకు సాగుతోందని ఆయన అన్నారు. ముఖ్యంగా మహబూబ్‌నగర్‌లో మెడికల్ కాలేజ్ స్థాపనను ప్రస్తావిస్తూ, ఈ ఆసుపత్రికి మంత్రికి – మిగతా4లో..



స్టాల్స్‌ను సందర్శిస్తున్న మంత్రి దామోదర రాజ నర్సింహా



ఆసుపత్రిలో కిట్లు అందజేస్తున్న రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి

## అభివృద్ధిని అడ్డుకుంటే సహించను

**రాష్ట్ర మంత్రి వాకిటి**

**శ్రీహరి ఫోటో కాల్ పాటించడం లేదు**

**కాంగ్రెస్ నాయకులు మద్యం సేవించి**

**నాపై దాడికి ప్రయత్నించారు**

**ఉద్రిక్తత మధ్య భూమి**

**పూజ నిర్వహించిన ఎంపి డీకే అరుణ**



అమరచింతలో ఉద్రిక్తతల మధ్య భూమి పూజ చేయడానికి వెళ్తున్న ఎంపీ డీకే అరుణ

**అమరచింత ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** కేంద్ర ప్రభుత్వం నిధులతో అమరచింత పెద్ద చెరువు సుందరి కరణ పనులకు భూమి పూజ నిర్వహిస్తుంటే కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం సిగ్గుచేటని అభివృద్ధిని అడ్డుకుంటే సహించేదే లేదని ఆమె అన్నారు. శుక్రవారం అమరచింత మండల కేంద్రంలోని అమరచింత పెద్ద చెరువు దగ్గర భూమి పూజ నిర్వహించడానికి పాలమూరు ఎంపీ డీకే అరుణ వస్తున్న సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి భూమి పూజ చేశారని మళ్లీ ఎందుకు వచ్చారని కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. కాంగ్రెస్, బిజెపి పార్టీల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడడంతో పోలీసులు ఇరు పార్టీలకు సర్ది చెప్పిన వినకపోవడంతో పాలమూరు ఎంపీ డీకే అరుణ ఉద్రిక్తతల మధ్య అమరచింత చెరువుకట్ట దగ్గర భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పనులకు, ప్రారంభోత్సవాల, భూమిపూజ పాలమూరు ఎంపీని ఆహ్వానించకపోవడం రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరికి ఫోటో కాల్ పాటించడం తెలియదా అని ఆమె ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో అభివృద్ధి చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని ఆమె అవహేళన చేశారు. ఇందిరమ్మ ఇండ్లలో కేంద్రం నిధులు ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు పేదలకు ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలకే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నారని ఆమె తెలిపారు. మక్తల్ నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి కొత్త సంప్రదాయం తీసుకొస్తున్నారని కాంగ్రెస్ నాయకులు మద్యం సేవించి నాపై దాడికి ప్రయత్నించారని ఆమె అన్నారు. పాలమూరు ఎంపీగా మహిళ ప్రజా ప్రతినిధిగా ఉన్న నన్ను కాంగ్రెస్ నాయకులు అవహేళన చేయడం బాధాకరమని ఇలాంటి చర్యలకు కాంగ్రెస్ నాయకులు పాల్పడితే భవిష్యత్తులో ప్రజలే బుద్ధి చెప్తారని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి, కొండయ్య, మంగ లావణ్య, మెరువ రాజు, క్యామ భాస్కర్, అశోక్ కుమార్, మంగ ఆంజనేయులు, దుబాయ్ వెంకటేశ్వర్ రెడ్డి, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

## గద్వాల జిల్లాలో

# ఆరెంజ్ అలర్ట్

**ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి**

**వడదెబ్బకు గురైతే తగిన చికిత్స తీసుకోవాలి**

**జాగ్రత్తలు తెలియజేసిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**గద్వాల ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** భారత వాతావరణ శాఖ హైదరాబాద్ వారి సూచనల ప్రకారం రాబోయే మూడు రోజులలో రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 23 డిగ్రీల సెల్సియస్ వరకు పెరిగే అవకాశం ఉన్నందున, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలో నేటి నుండి 41 నుంచి 44 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రజలు తగినంతగా ద్రవ పదార్థాలు తీసుకోవడం అత్యంత ముఖ్యమని, దాహం లేకపోయినా తరచుగా నీరు తాగాలని సూచించారు. ఓఆర్ఎస్ ద్రావణం, నిమ్మరసం, మజ్జిగ, పండ్ల రసాలు, ఉప్పుచక్కెర ద్రావణం వంటి ద్రవాలు తీసుకోవడం మంచిదన్నారు. ఇంటివద్ద ఓఆర్ఎస్ తయారీ కోసం ఒక లీటర్ తాగునీటిలో ఆరు టీ స్పూన్ల చక్కెర, అరకప్పు టీ స్పూన్ ఉప్పు కలిపి బాగా కలపాలని తెలిపారు. ప్రయాణాల సమయంలో తప్పనిసరిగా తమ వెంట తాగునీటిని తీసుకెళ్లాలని చెప్పారు. పుచ్చకాయ, ఖర్బూజ, కమలాలు, ద్రాక్ష, అనాసపండు, దోసకాయలలో నీటి శాతం అధికంగా ఉన్నందున ఇలాంటి సీజనల్ పండ్లు, కూరగాయలు తినాలని సూచించారు. ఎండలో బయటకు వెళ్లేటప్పుడు సన్నగా ఉండే లైట్ కలర్ కాటన్ దుస్తులు ధరించాలని, తలకు గొడుగు, టోపీ, తువాలు వంటివి వినియోగించి ఎండ తగలకుండా చూసుకోవాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి –మిగతా4లో..

## నేతువానిపల్లిలో

# చిరుత సంచారం

**గత మూడు నెలలుగా భయాందోళనలో గ్రామస్తులు**

**సీసీ కెమెరాలో రికార్డు చిరుత పులి దృశ్యాలు**



సీసీ కెమెరాలో చిరుత పులి దృశ్యాలు

**మల్దకల్ ఏప్రిల్9, ప్రభాతవార్త:** మండలంలోని నేతువానిపల్లి గ్రామంలో గత మూడు నెలలుగా వరుసగా జంతువులపై దాడి చేసిన ఘటనలు గ్రామస్తులను భయాందోళనకు గురి చేసింది. ఈ ఘటనపై స్పందించిన అటవీ శాఖ అధికారులు గురువారం రోజున అటవీ ప్రదేశంలో సీసీ కెమెరాలు అమర్చగా నిన్న చిరుత పులి దాడి చేస్తున్నట్లు అట్టి కెమెరాలో రికార్డు అయింది. ఇప్పటి వరకు గ్రామ శివారులో 8జంతువులు చిరుత దాడిలో మృతి చెందగా మరో జంతువుపై దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి గ్రామస్తులకు రక్షణ కలిగించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## వరి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

**నారాయణపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. వీసీ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా నిర్ణీత మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు జరుగుతుందని తెలిపారు గ్రేడ్‌ఏ రకానికి క్వింటాలుకు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 మద్దతు ధర ఉండగా, సన్న రకం వడ్లకు అదనంగా రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాలను ఎత్తైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసి, గోనె సంచుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు తాగునీరు, నీడ, విద్యుత్, టాయిలెట్లు, టేబుల్‌లు, కుర్చీలు వంటి సౌకర్యాలు కల్పించడంతో పాటు, ప్రతి కేంద్రంలో రెండు ఎలక్ట్రానిక్ తూకం పరికరాలు, 30 టార్పాలిన్లు, ఒక ప్యాడీ క్లీనర్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. రైతులు ధాన్యం తీసుకువచ్చే సమయంలో తేమ శాతం 17 లోపు ఉండాలని, అవసరమైతే ముందుగా ఆరబెట్టుకుని రావాలని సూచించారు. కొనుగోలు సమయంలో ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, పట్టాదారు పాస్‌బుక్ నకళ్లు సమర్పించాలని, కౌలు రైతులు ధృవీకరణ పత్రం తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు ధాన్యం సంచుల గుర్తింపులో సన్న రకానికి ళ్లీ అక్షరం, ఎరుపు దారం, దొడ్డు రకానికి ఆకుపచ్చ దారం ఉపయోగించాలని, రవాణా సమయంలో రకాలను వేర్వేరుగా తరలించాలని ఆదేశించారు. కొనుగోలు అనంతరం రైతులకు తూకం వివరాలతో రసీదు ఇవ్వడం తప్పనిసరి అన్నారు. జిల్లాలో మొత్తం 160 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో ఐకెపి 82, పిఎసిఎస్ 65, మెప్మా 5, ఎఫ్‌పీఓ 7, ఏఎంసీ 1 కేంద్రం ఉన్నాయని వెల్లడించారు. అలాగే రైతుల కోసం హెల్ప్‌లైన్ నంబర్లు 1800425000333, 1967 అందుబాటులో ఉన్నాయని చెప్పారు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, అధికారులు సమన్వయంతో పని చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను, డీఎస్పీ లింగయ్య, డీఆర్‌డీఏ మొగులప్ప, వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



వీసిలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

## వేగవంతమైన స్పందన కీలకం

**మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి**

**ఏఆర్ సిబ్బందికి రెండు వారాల మొబిలైజేషన్ శిక్షణ**



మాట్లాడుతున్న ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** పోలీసులకు వేగవంతమైన స్పందన అత్యంత కీలకమని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ఏఆర్ సిబ్బందికి రెండు వారాల పాటు మొబిలైజేషన్ శిక్షణ కార్యక్రమం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కవాతు మైదానంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి.జానకి ముఖ్య అతిథిగా విచ్చేసి శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం శిక్షణ పొందుతున్న సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ మొబిలైజేషన్ శిక్షణ అనేది రిఫ్రెషర్ కోర్సు లాంటిదని, సిబ్బంది తమకు ముందుగా అందిన శిక్షణను పునరుద్ధరించుకునేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రస్తుత కాలంలో పోలీసు విధుల్లో వేగవంతమైన స్పందన అత్యంత కీలకమని, ఈ తరహా శిక్షణల ద్వారా అత్యవసర – మిగతా4లో..

## అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట

- **పేదింటి బిడ్డలకు కళ్యాణ లక్ష్మి ఓ వరం**
- **సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి**
- **ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**కల్వకుర్తి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్షమని, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజల వద్దకు తీసుకెళ్లాలన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 30 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు, 40 మంది కి సీఎం సహాయనిధి చెక్కులు, అంగన్వాడి టీచర్లకు మొబైల్ ఫోన్లు ఎమ్మెల్యే నారాయణరెడ్డి అందజేశారు. అంగన్వాడి టీచర్లు పాఠశాలకు వచ్చే విద్యార్థిని, విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసేందుకు మొబైల్ ఫోన్ ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి ద్వారా అందిస్తున్న లక్ష 16 రూపాయలు పేదింటి బిడ్డలకు ఓ వరమని ఆయన గుర్తు చేశారు. ఆడపిల్లలు కలిగిన తల్లిదండ్రులు ఆ బిడ్డల వివాహాలు చేయలేక ఎంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర ప్రభుత్వం అందించే కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆ కుటుంబాలకు ఆసరా అవుతుందని ఆయన తెలిపారు. ప్రమాదవశాత్తు గాయపడిన క్షతగాత్రులకు చికిత్స చేయించుకోలేని వారికి ప్రభుత్వం అండగా నిలిచి ఎల్‌ఓసి ద్వారా చికిత్స చేయించుకునేందుకు వీలు కల్పించడంతోపాటు చికిత్స చేయించుకున్న తర్వాత వైద్యానికి పెట్టిన డబ్బులు ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందించి బాధిత కుటుంబాలకు భరోసా కల్పిస్తుందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. అర్హులైన పేదలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అంగన్వాడి కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతి నిధి బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, తహసిల్దార్ ఇబ్రహీం, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, బాల్ రెడ్డి, రాహుల్, కౌన్సిలర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణలక్ష్మి చెక్కులు, మొబైల్ ఫోన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

## దివ్యాంగుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం..

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**16 మంది దివ్యాంగులకు ఎలక్ట్రిక్ స్కూటీల పంపిణీ**

**మహబూబ్‌నగర్‌బ్యూరో, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** దివ్యాంగుల సంక్షేమం అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని, దివ్యాంగుల స్వతంత్రత పెంపుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో 16మంది – మిగతా4లో..



దివ్యాంగులు ఎలక్ట్రికల్ స్కూటీలు అందజేస్తున్న దృశ్యం

## మెనూను ఖచ్చితంగా అమలు చేయాలి..

**విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించాలి**

**డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించిన కలెక్టర్**

**వనపర్తి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూను ఖచ్చితంగా అమలు చేయడంతో పాటు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల వెనుక భాగంలో ఉన్న ప్రభుత్వ బీసీ కళాశాల విద్యార్థుల సంక్షేమ హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల గదులు, వంటశాల (కిచెన్), స్టాక్ రూమ్‌ను పరిశీలించి హాస్టల్‌లో అందిస్తున్న అన్ని సదుపాయాలను తనిఖీ చేశారు. ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విచారించిన కలెక్టర్, సమస్యలు ఉంటే వెంటనే తహసీల్దార్ దృష్టికి తీసుకురావాలని, అవి త్వరితగతిన పరిష్కరించబడతాయని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వ నిర్ణయించిన మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. మెనూను ఖచ్చితంగా అమలు చేయడంతో పాటు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే హాస్టల్‌కు నాణ్యమైన బియ్యం సరఫరా జరుగుతోందా అని అడగగా, అధికారులు నాణ్యమైన బియ్యం అందుతోందని తెలిపారు. కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి హాస్టల్ సదుపాయాలపై వారి అభిప్రాయాలను తెలుసుకోగా, విద్యార్థులు అన్ని సౌకర్యాలు బాగున్నాయని తెలిపారు. డబల్‌బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలో సదుపాయాలు కల్పించాలి. కలెక్టర్ రాజపేట గ్రామ శివారులోని డబల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీని సందర్శించారు. అక్కడ స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రధాన రహదారికి కలిసే కనెక్టివిటీ రోడ్ విషయం సహా, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని స్థానికులు తెలియజేయగా, వీటిని త్వరలోనే పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి ముజాహిద్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసిల్దార్ రమేష్ రెడ్డి ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



హాస్టల్లోని వంటశాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

## ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం

**చలివేంద్రం ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్**

**అచ్చంపేట,ఏప్రిల్,10 ప్రభాతవార్త :**రామ్ రహీం లోకల్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చలి వేంద్రం ఏర్పాటు చేశారు. శుక్ర వారం పట్టణంలో అమరవీరుల స్థూపంవ ద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅ తిథిగా మున్సి పల్ చైర్మన్ గార్లపాటి శ్రీని వాసులు హాజరై ప్రారంభిం చారు.అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి దృష్టిలో పెట్టుకొని రామ్ రహీం లోకల్ ఆటో యూనియన్ ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. ముఖ్యంగా ఈ ఆటో యూనియన్ ఐక్యతను కొనియాడారు. మండు టెండల కారణంగా వివిధ గ్రామాల నుండి వచ్చే ప్రజలకు దాహార్తి తీర్చడానికి వీలు చేస్తున్న సేవ అభినందనీయమన్నారు. అదే విధంగా రామ్ రహీం లోకల్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఎన్నో సామాజిక సేవలు నిర్వహి స్తుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గౌరీ శంకర్, విష్ణురెడ్డి, ఆటో యూనియన్ అధ్యక్షుడు మహబూబ్ అలీ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఖాదర్ బాషా,ఖాజామీయా, ముస్తాక్, వెంకటేష్,ఉస్మాన్,అశు,శ్రీనివాసచారి,జహంగీర్,చందుహరి సింగ్,లక్ష్మయ్య,అక్బర్, చందు,అశోక్, కాజా,శివ,బురాన్,అఖిల్,అఖిల్నిరంజన్ షబ్బీర్ చౌకత్, అజ్జు, భాష, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ విద్యలో కొత్త కోర్స్ పరిచయం

**జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎర్ర అంజయ్య**

వనపర్తి, ఏప్రిల్ 10, ప్రభాతవార్త : 2026,27 విద్యా సంవత్సరం నుండి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎసిఇ (అకౌంటెన్సీ, కామర్స్, ఎకనామిక్స్) గ్రూప్‌ను ప్రవేశపెడుతున్నట్లు తెలంగాణ ఇంటర్ బోర్డ్ అధికారికంగా ప్రకటించింది.విద్యార్థుల భవిష్యత్తు కోసం ఒక సరికొత్త విద్యా అవకాశాన్ని తెలంగాణ రాష్ట్రఇంటర్మీడియట్ విద్యామండలి (టిజిబిఐఇ) పరిచయం చేసింది. ఇంటర్ స్థాయిలోనే అకౌంటెన్సీని ఒక ప్రధాన సబ్జెక్టుగా చదవడం వల్ల విద్యార్థులకు సబ్జెక్టుపై పట్టు పెరగడమే కాకుండా, ఉన్నత విద్యలో రాణించే అవకాశం ఉంటుంది. అకౌంటెన్సీ, కామర్స్,ఎకనామిక్స్ సబ్జెక్ట్స్ వల్ల సిఎ (చార్టర్డ్ అకౌంటెన్సీ),సిఎస్,సిఎంఎ వంటి ప్రొఫెషనల్ కోర్సులను లేదా ఫైనాన్స్ రంగంలో కెరీర్‌ను ఎంచుకోవాలనుకునే విద్యార్థులకు ఈ గ్రూప్ పునాదిగా మారుతుంది.విద్యా వ్యవస్థలో వస్తున్న ఈ మార్పులు విద్యార్థుల ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాయి.ఈ విద్యా సంవత్సరం (202627) నుండి తిదిని గ్రూప్‌ను నిర్వహించాలనుకునే కళాశాల యాజమాన్యాలు వెంటనే ఇంటర్ బోర్డ్‌కు దరఖాస్తు చేసుకోవాలి.తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఈ కొత్త గ్రూప్ గురించి విద్యార్థులకు తల్లిదండ్రులకు అడ్మిషన్ల సమయంలో విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎర్ర అంజయ్య తెలిపారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు

**జెడ్పి డిప్యూటీ సీఈఓ గోపాల్ నాయక్**



ఉప్పునుంతల ఎంపిడిఓ కార్యాలయంను సందర్శించిన జడ్పీ డిప్యూటీ సిఇఓ గోపాల్ నాయక్

**ఉప్పునుంతల, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ గోపాల్ నాయక్ హెచ్చరించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 వ ఆర్థిక సంవత్సరం నకు సంబం ధించి 2025, 26 సంవత్సరం సంబంధించి నిర్వహిస్తున్న యాక్షన్ ప్లాన్ ను అడిగి తెలుసుకు న్నారు. ఎంపీడీఓ కార్యాలయం పైకప్పు పెచ్చులు పడి దెబ్బతినడంతో 2025,26 సంవత్సరాని కి సంబంధించిన యాక్షన్ ప్లాన్ లో భవన నిర్మాణ పనులను చేపట్టాలని సూచించారు. అదేవి ధంగా ఎస్సీ కార్పొరేషన్ కింద మండలానికి 165 టూ వీలర్స్, 81 త్రీ వీలర్స్,18 సోలార్ పంపుసెట్లు, 87 యూనిట్లు పాడి గేదెలు మంజూరు కావడం జరిగిందని వాటికి సంబంధించి అర్హులైన వారు ఈ నెల 16 వరకు దరఖాస్తు చేసుకోవాలని జడ్పీ డిప్యూటీ సిఇఓ గోపాల్ నాయక్ తెలిపారు. ఆయనతోపాటు ఎంపిడిఓ రేవత్ రెడ్డి,సిఇఓ కార్యాలయం సిసి మామిడి శెట్టి వెంకటేష్, నాయకులు తిప్పర్తి నరసింహారెడ్డి ఉన్నారు.

## ప్రజారోగ్య సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**వెల్దండ,ఏప్రిల్ 10 ప్రభాతవార్త:**ప్రజారోగ్యంపై నిరంతరం వైద్యులు పని చేస్తున్నారని గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని సబ్‌సెంటర్ పరిధిలో ఎన్‌సిడి (అంటు వ్యాధులు కాని వ్యాధులు)స్క్రీనింగ్ కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సింధు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిధులుగా గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ హాజరై మాట్లాడుతూ బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగిన చికిత్స చేస్తారని, మందులు ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాధ, పర్యవేక్షకులు మురళీ కృష్ణ, మనోజ్ కుమార్, వార్డు సభ్యులు గుద్దటి కిష్టల్, ముదికొండ కవిత రమేష్, పిల్లి దేవేందర్, ఆరోగ్య కార్యకర్త జహంగీర్ బీ, ఆశా కార్యకర్తలు యాదమ్మ, సుజాత, అనిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## మండల ముదిరాజ్ నాయకులు అరెస్ట్

**వెల్దండ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:**తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కమిటీ మేరకు ముదిరాజ్ సాధనకై గాంధీభవన్ ముట్టడి కార్యక్రమంలో భాగంగా మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు బాదేపల్లి మల్లయ్య ముదిరాజ్, యూత్ అధ్యక్షులు మొక్కల శ్రీనివాస్ ఆధ్వర్యంలో తరలివెళ్తున్న తరుణంలో పోలీసులు మండల కేంద్రంలో ముందస్తుగా ముదిరాజ్ సంఘం నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముదిరాజులను బీసీ డీ నుంచి బీసీఏ గ్రూపులో చేర్చాలని, కోకాపేటలో ముదిరాజుల భవనానికి కేటాయించిన 5 ఎకరాల స్థలంలో భవన నిర్మాణం చేపట్టాలని, ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం అరెస్ట్‌చేసిన ముదిరాజ్‌నాయకులను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.కార్యక్రమంలో పిల్లిదేవేందర్ ముదిరాజ్,మిర్యాల యాదయ్య,రంగరాతి శ్రీశైలం, కొండలు, కృష్ణ తదితరులు ఉన్నారు.

## లబ్ధిదారునికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

**కొల్లాపూర్,ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెంట్లవెల్లి మండలం జటప్రోలు గ్రామానికి చెందిన సీఎంఆర్‌ఎఫ్ బాధితురాలికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 51.000 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బాధిత కుటుంబానికి మాజీ ఎంపీపీ గోవిందు గౌడ్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందిన దరఖాస్తులను పరిశీలించి, అర్హులైన వారికి చెక్కుల రూపంలో నేరుగా సహాయం పంపిణీ చేస్తుందని. తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సీఎంఆర్‌ఎఫ్ ఒక అభయ హస్తంలా పనిచేస్తుందని ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు అండగా వుంటుందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా ఉండాలని పలు సుచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోవింద్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ భీమిరెడ్డి ,ముఖ్య నాయకులు నాగిరెడ్డి, మాజీ వార్డ్ నెంబర్ కృష్ణయ్య, వార్డ్ మెంబర్ కుర్మయ్య, అబూబాకర్, వెంకటరమణారెడ్డి, రాముడు, దయాకర్ , మహేష్ గౌడ్, చిన్న కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవాలు

**దామరగిద్ద, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:**భారతదేశంలో అతిపెద్ద క్రీడా వేదికగా పేరుగాంచిన ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవాల కార్యక్రమంలో భాగంగా దామరగిద్ద మండల కేంద్రంలో శుక్రవారం క్రికెట్ పోటీలను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు నాగరావు నామాజీ ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు సత్యాదవ్, దామరగిద్ద ఇంచార్జి లక్ష్మీ శ్యాంసుందర్, జిల్లా నాయకులు గోపాల్ రావు, సత్యనారాయణ, మండల అధ్యక్షులు సంజీవ్ గౌడ్, అబ్దుల్ నబి, క్రికెట్ ఇంచార్జి మోనేష్ తదితరులు పాల్గొన్నారు.నాయకులు మాట్లాడుతూ, యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఈ మహోత్సవాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఇదిమంచివేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవం తం చేశారు.క్రికెట్ పోటీలు ఉత్సాహభరితంగా ప్రారంభమై, క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు.

## పేదలకు అండగా రేవంత్ సర్కార్..

**నర్వ మండలంలో సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**

**నర్వ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** రాష్ట్రంలో నిరుపేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆపన్నహస్తం అందిస్తోంది. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు నర్వ మండలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్‌ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్, డిసిసి జనరల్ సెక్రెటరీ నాగన్నగారి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా జంగంరెడ్డిపల్లి, యాంకి గ్రామాలకు చెందిన ముగ్గురు లబ్ధిదారులకు ఈ ఆర్థిక సహాయం అందజేశారు. లబ్ధిదారులు కావాలి సుందరమ్మ (జంగంరెడ్డిపల్లి)రూ. 30,000,దేశాయిగారి నరేందర్ (యాంకి) రూ.37,000,కుమ్మరి పెద్ద నరసింహ (యాంకి) లకు రూ.25,500,ఎల్వోసి లను అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,ఆపద కాలంలో నిరుపేదలకు అండగా నిలిచేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంఎంసి డైరెక్టర్ మార్కా నరేష్, నర్వ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్రాంరెడ్డి, బోయపాటి నరసింహ,అలాగే యాంకి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైద్య విద్యార్థులకు మెరుగైన వసతులు

- నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



క్రిటికల్ కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:**మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యవసర సమయాల్లో వైద్య సేవలను అందించడం ద్వారా ప్రజల ప్రాణాలు కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్రిటికల్ కేర్ సెంటర్లను రాష్ట్రవ్యాప్తంగా నెలకొల్పడం జరుగుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ఆవరణలో 23కోట్ల 75లక్షల రూపాయల వ్యయంతో 50బెడ్ల సామర్థ్యంతో అత్యాధునిక వసతులతో నిర్మించిన క్రిటికల్ కేర్ బ్లాక్ అత్యవసర సేవల విభాగాన్ని, తెల్కపల్లి మండల కేంద్రంలో 1కోటి 59 లక్షల రూపాయలవ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని, రాష్ట్ర ఆరోగ్య,వైద్య,కుటుంబ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చోంగ్తూ, కమిషనర్ సృజన, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవిందర్ నాయక్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డితో కలిసి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగినా, హార్ట్‌స్ట్రోక్ వచ్చిన, విష జ్వరాలు ప్రబలిన ఇకపై హైదరాబాద్‌కు పరుగులు తీయాల్సిన అవసరం లేకుండా ఉండేందుకే నాగర్‌కర్నూల్ జిల్లా లాంటి మారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆరోగ్య సంరక్షణా అధిక ప్రాధాన్యత ఇచ్చి క్రిటికల్ కేర్ బ్లాక్ ద్వారా అత్యవసర సేవల విభాగాలను ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా వైద్యుల మరియు నర్సుల ఖాళీలను భర్తీ చేయడానికి భారీ స్థాయిలో నియామకాలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు.ప్రస్తుతం రాష్ట్రంలో 43వేలపడకలు (బెడ్లు) సిద్ధంగా ఉన్నాయి.అలాగే ప్రతిరోజూ రాష్ట్రం అంతటా వైద్య సేవలు అందిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్యల వల్ల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, ఆరోగ్య వ్యవస్థ మరింత బలపడుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 35 వైద్య కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన, ఆధునిక విద్యాబోధన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని హాస్టల్ వసతులు, లైబ్రరీలు, ల్యాబొరేటరీలను అభివృద్ధి చేస్తున్నామని, విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని హాస్టల్ సౌకర్యాలు, ఆధునిక పరికరాలు, మెరుగైన బోధన విధానాలు, క్లినికల్ ట్రైనింగ్ వంటి అంశాల్లో అభివృద్ధి చేస్తామని, అలాగే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కారం చూపుతుందని హామీ ఇచ్చారు. నాగర్‌కర్నూలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన మెడికల్ మసతుల కల్పనకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెండు కోట్ల అరవై ఐదు లక్షల రూపాయలు అందుబాటులో ఉంచడం జరిగిందని, అవసరమైన వైద్య పరికరాల కొనుగోలుకు నేరుగా కలెక్టర్ కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర వైద్య



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి

ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మెడికల్ కళాశాల విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఆసుపత్రిని 550పడకల సామర్థ్యానికి అభివృద్ధి చేసి నా ణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుం టున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోజువారి సేవలపై ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకొ చ్చారు. మంత్రి కూడా పరిస్థితిని సమీక్షి ంచి, అవసరమైన సిబ్బంది నియామకం, సదుపాయాల మెరుగుదలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అభివృద్ధి కార్యక్రమాలకు హాజరైన మంత్రికి కలెక్టర్ బాదావత్ సంతోష్ శాలువాలతో సన్మానించి పుష్ప గుచ్చం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాగర్ కర్నూల్ మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, మున్సిపల్ వైస్ చైర్మన్ బాదాం రమేష్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, టౌన్ ప్రెసిడెంట్ జక్కా రాజు, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ మాధవ్ రెడ్డి, డీఎంహెచ్వో రవి నాయక్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, వైద్య విద్యార్థులు, అధికారులు, వివిధ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో కొనసాగుతున్న బడిబాట కార్యక్రమం




గ్రామాలలో బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్న పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

**ఉప్పునుంతల, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించడంతో పాటు మౌలిక వసతులు కల్పించడం జరుగుతుందని పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాడూరు, గట్టు కాడిపల్లి, తిరుమలాపూర్ గ్రామాలలో 202627 విద్యా సంవత్సరానికి గాను ప్రత్యేక ప్రవేశాల కోసం గ్రామాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో అవగాహన కల్పిస్తూ ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు అవగాహన కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పీఎం శ్రీ పథకంలో భాగంగా పాఠశాలల్లో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్ రూమ్స్, అధునాతన ల్యాబ్స్, క్రీడా ప్రాంగణం గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో ఎలాంటి ఖర్చులు లేకుండా ఉచిత నిర్బంధ విద్య అందించడం జరుగుతుందని, అత్యుత్తమ విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం, విద్యార్థులకు ఏకరూప దుస్తులు, రాగి జావా, స్కాలర్ షిప్ లాంటి మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని వాటిని గ్రామీణ ప్రాంతాలలో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అవగాహన సదస్సు లో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీ, గోపి, శ్యామల గౌరి, బిల్కిస్ , కవిత, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదేవిధంగా తల్లిదండ్రులకు ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

## వడదెబ్బలకు గురికాకుండా అప్రమత్తతతో వ్యవహరించాలి



సమావేశం ఏర్పాటు చేసిన డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ రాజశేఖర్

**వీపనగండ్ల ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** ప్రజలు కార్మికులు ఉపాధి హామీపథకంలో పనిచేసే కూలీలకు వైద్య అధికారులు డాక్టర్ వంశీకృష్ణ డాక్టర్ రాజశేఖర్ తగు సూచనలు సలహాలు చేశారు. ఆశా వర్కర్లు ,ఇతర వైద్యాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి తగు సూచనలు సలహాలు ఇచ్చారు. ప్రస్తుతం వేసవి కాలంలో ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ఫీల్డ్‌లో పనిచేసే కార్మికులు వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారికి వివరించాలని సూచించారు. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పారాసిటమాల్ వంటి అవసరమైన అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. డిపో కేంద్రాలను అంగన్వాడీ కేంద్రాలు, గ్రామపంచాయితీ కార్యాలయాలు, మహిళా సంఘాలు మొదలైనవి ఏర్పాటు చేసి, ప్రజలకు అవసరమైన సేవలు అందుబాటులో ఉండేలా చూడాలని క్షేత్రస్థాయి సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలకు సూచించారు.ముఖ్యంగా పనికి ఆహారం పథకంలో పనిచేసే వారికి అవగాహన కల్పిస్తూ, అవసరమైన అత్యవసర మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.ఆయుష్ డాక్టర్లు, సూపర్వైజర్లు మరియు ఆరోగ్య కార్యకర్తలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆశా కార్యకర్తలు తమకు కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో రోగులను వెంటనే ఆసుపత్రికి తరలించాలని సూచించారు. అదేవిధంగా ఎన్‌సిడి స్క్రీనింగ్, ఆసుపత్రి ప్రసవాలు, ఏఎన్‌సి రిజిస్ట్రేషన్ల లక్ష్యాల వారీగా పూర్తిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్లు శ్వేత, కరుణశ్రీ, భాగ్యశ్రీ, మోనిక, కళమ్మ, సూపర్వైజర్లు విజయకుమారి డిఈఓ రాఘవేందర్ ఏఎన్ఎంఎస్ మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సమక్షంలో అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరణ



నూతన కమిటీని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

**వెల్దండ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా మూడవత్ హరికిషన్‌నాయక్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో శుక్రవారం ఘనంగా బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై హరికిషన్ నాయక్‌ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. అదేవిధంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వెల్దండ గ్రామం మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి జిల్లా, ప్రధాన కార్యదర్శిగా మూడవత్ మోతిలాల్ నాయక్, కార్యదర్శిగా బాణావత్ శంకర్ నాయకులను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పని చేసి మండల స్థాయిలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నూతన అధ్యక్షుడు హరికిషన్ నాయక్ మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పిసిబి బోర్డు మెంబర్ ఠాకూర్ బాలాజీ సింగ్, రామచంద్రారెడ్డి, కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, పూల్‌సింగ్, మట్ట వెంకటయ్య గౌడ్, శేఖర్ రెడ్డి, అన్వర్ పాష, మెగావత్ శీను నాయక్, గున్నేళ్ల శ్రీనివాస్, సబావత్ రమేష్ నాయక్, సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, లచ్చిరాం నాయక్, రాజు యాదవ్, రమేష్ ముదిరాజ్, బద్రు తారాసింగ్, రాందాస్, కేశమళ్ల కృష్ణ, రవీందర్ నాయక్, అరుణ్ నాయక్, పత్యా నాయక్, ఎర్ర శ్రీను ముదిరాజ్, ముదిగొండ రమేష్, గుత్తి చంద్రశేఖర్, మట్ట భరత్ గౌడ్, ఈదులపల్లి శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే వరకు పోరాటం

**తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి**

**కోయిలకొండ ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై నిరంతరం పోరాటం నిర్వహిస్తామని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక అన్నారు. శుక్రవారం కోయిలకొండ మండలం చంద్రాస్ పల్లి గ్రామంలో నూతన తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి గ్రామ కమిటీ ఎన్నికకార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయనతోపాటు తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు కేతూరి శివన్న హాజరయ్యారు. తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి ఆవిర్భవించిన నాటి నుంచి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని మండలాల్లో, అన్ని గ్రామీణ ప్రాంతాలలో పర్యటిస్తూ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశంపై రజకులకు సమగ్రంగా వివరిస్తూ వారిని చైతన్య పరచడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో తెలంగాణ రిజర్వేషన్ సమితి రజకుల సమస్యలపై నిరంతరం పోరాటం నిర్వహిస్తూ ఏకైక సంఘంగా పనిచేస్తుందన్నారు. అనంతరం గ్రామ తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి అధ్యక్షులుగా అంజయ్య ను, ఉపాధ్యక్షులుగా రవీందర్, ప్రధాన కార్యదర్శిగా రామచంద్రయ్య, సంయుక్త కార్యదర్శిగా తిరుపతయ్య, కోశాధికారిగా వెంకట్ రాములు, కార్యవర్గ సభ్యులుగా వెంకటయ్య, శ్రీనివాసులు, బాలకృష్ణయ్య తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఎన్నికకు రాష్ట్ర నాయకులు కొంకటి లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యద ర్శి సిహెచ్ సతీష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్ రాజు హాజరయ్యారు.కార్యక్రమంలో సి సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన

**ఉప్పునుంతల,ఏప్రిల్ 10ప్రభాతవార్త :**మండలంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఎంపిడిఓ రేవత్ రెడ్డి పరిశీలించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కూలీలకు సూచించారు. మండలంలోని మర్రిపల్లి, లక్ష్మాపూర్ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కూలీలు నిర్వహిస్తున్న భూమి చదును పనులు నిర్వహిస్తున్న ప్రాంతాన్ని ఎంపిడిఓ రేవత్ రెడ్డి సందర్శించి పనుల స్థితిగతులను పరిశీలించారు. కూలీల మస్టర్ రోల్ ను పరిశీలించారు.ఎంపిడిఓ రేవత్ రెడ్డి తో పాటు ఎపిఓ పర్వతాలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**టిజివిబి బ్రాంచ్ మేనేజర్ భరత్ రాజ్**

**ఉప్పునుంతల, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు సేవలు రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పునుంతల టిజివిబి బ్రాంచ్ మేనేజర్ భరత్ రాజు సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల శ్రీ కేదారేశ్వర ఆలయ ప్రాంగణంలో జరిగిన అవగాహన సదస్సులో బ్రాంచ్ మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు అందజేయడం జరుగుతుందని, రైతులు, బ్యాంకు ఖాతాదారులు రుణాలు తీసుకున్న ఖాతాదారులు సకాలంలో రుణాలు చెల్లించి బ్యాంక్ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. బ్యాంకు అందిస్తున్న సేవల పట్ల ఆయన అవగాహన కల్పించారు.

## పూలే జయంతి ఉత్సవాలను విజయవంతం చేద్దాం



**నర్వ, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావ్ పూలే జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని అంబేద్కర్ యువజన సంఘం రాయికోడ్ గ్రామ అద్యక్షులు మల్లన్ కోటి శంకర్ పిలుపునిచ్చారు.అంబేద్కర్ యువజన సంఘం ఆద్వర్యంలో నిర్వహించే జయంతి ఉత్సవాలకు గ్రామ పెద్దలు, అధికారులు, అనధికారులు సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డు సభ్యులు,సబ్బండ వర్గాల ప్రజలు,అన్ని కుల సంఘాల నాయకులు,అన్ని రాజకీయ పార్టీల నాయకులు,యువకులు,మహిళలు,విద్యార్థిని విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

## చలివేంద్రము ప్రారంభించిన సర్పంచ్

**ఎర్రవల్లి ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** ఎర్రవల్లి మండల కేంద్రంలో చలివేంద్రమును, చలువ పందిర్లను ఎర్రవల్లి సర్పంచ్ అనిత కృష్ణసాగర్ ఏర్పాటు చేసి శుక్రవారం వాటిని ప్రారంభించడం జరిగింది. ఎర్రవల్లి చౌరస్తా గుండా జాతీయ రహదారి ఉండడం చేత నిత్యం వందలాదిమంది ప్రయాణికులు ఎర్రవల్లి చౌరస్తా నుండి ప్రయాణించడం జరుగుతుంది. వేసవికాలంలో ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రమును ప్రయాణికులు నీడలో నిలబడడానికి చలువ పందిళ్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్రారంభోత్సవంలో ఎర్రవల్లి మండల ఎంపీడీవో మహేష్, పంచాయతీ సెక్రటరీ రంగన్న, ఉప సర్పంచ్ మద్దిలేటి గౌడ్, గ్రామ పెద్దలు పోలీస్ రాగన్న, రామకృష్ణ గ్రామస్తులు పాల్గొన్నారు.

## పి.డి.ఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వాహనం స్వాధీనం



**నారాయణ పేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణంలో పి.డి.ఎస్ (రేషన్) బియ్యం అక్రమ రవాణాను పోలీసులు అడ్డుకున్నారు ఉదయం యాద్గిర్ రోడ్, భైరం కొండ గ్రామ సమీపంలో టాస్క్ ఫోర్స్, నారాయణపేట పోలీసులు సంయుక్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న టీఎస్ 06 యుడి 0828 అశోక్ లేలాండ్ వాహనాన్ని పట్టుకున్నారు. వాహనం నుండి మొత్తం 50 బియ్యం సంచులు, సుమారు 25 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు ఈ బియ్యం వాహన యజమాని వెంకటేష్, దామరగిద్ద మండలం నర్సాపూర్ గ్రామానికి చెందినవాడిగా గుర్తించారు డిటి కాలప్ప పంచనామ నిర్వహించిన అనంతరం వెంకటేష్‌పై నారాయణపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

## మండల అభివృద్ధికి సహకరించాలి

◆ కాంగ్రెస్ మండల అధ్యక్షులు చిమ్ముల రాజశేఖర్ రెడ్డి

**వంగూరు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** వంగూరు మండలాన్ని అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధికి తోడ్పాటు చేసే విధంగా కృషి చేయాలని సీఎం సోదరుడు కృష్ణారెడ్డికి వంగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిమ్ముల రాజశేఖర్ రెడ్డి విన్నవించారు. శుక్రవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి మండల అభివృద్ధిపై చర్చించారు. మండల కేంద్రంలో సమీకృత భవనాల నిర్మాణం త్వరగా చేపట్టాలని, అసంపూర్తిగా ఉన్న రహదారుల నిర్మాణం పూర్తి చేసి రవాణా సౌకర్యం కల్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూసే బాధ్యత తీసుకోవాలని ఆయన కోరినట్లు తెలిపారు. సీఎం సొంత మండలంరాష్ట్రానికి ఆదర్శంగా ఉండే విధంగా మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పర్చేందుకు ముందడుగు వేసి ఇప్పటికే కొన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని మరిన్ని గ్రామాలను అభివృద్ధి పర్చేందుకు ప్రత్యేక నిధులను మంజూరు చేసి అభివృద్ధి పరిచి ఈ మండల ప్రజల కోరికను నెరవేర్చాలని తెలపడంతో సీఎం సోదరుడు కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మండలాన్ని అభివృద్ధి పరిచి మండల ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకునేందుకే సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఉన్నట్లు త్వరలోనే మండల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించే విధంగా సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## ఆర్యవైశ్య, వర్తక సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్

**పెబ్బేరు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** ఎండలు తీవ్ర రూపంగా మారిన నేపథ్యంలో బాటసారులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి పట్టణ ఆర్య వైశ్యులు, వర్తక సంఘం కిరాణం అసోసియేషన్స్ ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ చౌరస్తాలోని శ్రీవిద్యాబుక్ సెంటర్ ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ వేసవి తాపం దృష్ట్యా వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వచ్చే ప్రయాణికులు, బాటసారులకు ఇబ్బంది కలగకుండా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మంచినీటిని అందించడం మంచి లక్షణం అని అన్నారు. సమాజంలో సేవా దృక్పథంతో ముందుకు వచ్చిన ఆర్యవైశ్య సంఘం, వర్తక సంఘం ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. పట్టణంలోని ఇతర సంఘాలు కూడా ఇటువంటి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు హరి శంకర్ నాయుడు, మన్యం, పట్టణ ఆర్యవైశ్య సంఘం సభ్యులు, కిరాణం అసోసియేషన్ సభ్యులు సుబ్బయ్య, నాయకులు షకీల్, బుర్రమోని రాములు యాదవ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

### గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డులో

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు

**గద్వాల ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** యాసంగి సీజన్ 202526 కు సంబంధించి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని గద్వాల మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసినట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని గద్వాల, మల్దకల్, ధరూర్, గట్టు, కేటి దొడ్డి మండలాల రైతుల కోసం ఈ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయబడినట్లు పేర్కొన్నారు. రైతులు పండించిన మొక్కజొన్నను ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం క్వింటాల్‌కు రూ. 2400/ చెల్లించి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఒక ఎకరాకు 25 క్వింటాళ్ల వరకు మాత్రమే కొనుగోలుచేయబడునని తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావడానికి ముందు టోకెన్ తీసుకోవాలని సూచించారు. రైతులు తీసుకురావలసిన పత్రాలు:ఎ. ఈ. ఓ. ధ్రువీకరణ పత్రము పట్టాదారు పాసుబుక్ జిరాక్స్ ఆధార్‌కార్డు జిరాక్స్ బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ (రైతుబంధుకు లింక్ చేయబడినది) ఈ పత్రాలు తప్పనిసరిగా తీసుకురావాలని జిల్లా మార్కెటింగ్ అధికారి సూచించారు. ఈ కొనుగోలు కేంద్ర ప్రారంభోత్సవంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంత్, వైస్ చైర్మెన్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ , వైస్ చైర్మెన్ , నాయకులు సుభాన్, రమేష్ నాయుడు, మాజీ జెడ్పి చైర్మెన్ బండారి భాస్కర్, మహేశ్వర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు, మాజీ జెడ్పీటీసీ చైర్మన్, మాజీ సింగిల్ విండో చైర్మన్, జిల్లా మార్కెటింగ్ అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, ఏడీఏ, జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి, పిఏసిఎస్ సెక్రటరీలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ముదిరాజుల ముందస్తు అరెస్టు



**బిజినేపల్లి, ఏప్రిల్10 ప్రభాతవార్త:** హలో ముదిరాజ్ చలో గాంధీ భవన్ కార్యక్రమానికి బయలుదేరిన ముదిరాజులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో అమలు చెయ్యలేని హామీలను ఇచ్చినటువంటి ప్రభుత్వం హక్కులను అడుగుతుంటే ముందస్తుతో అరెస్టు చేస్తూ ముదిరాజులను నిర్బంధించి వారి హక్కులను కాలరాస్తున్నారని ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు తుమ్మల అల్లోజి అన్నారు. ప్రభుత్వ పెద్దలు గద్దెనిక్కి ప్రజా పాలన పేరుతో ప్రజలను అన్నివేస్తున్న తీరు బాధాకరం అన్నారు. హక్కులను కాలరాస్తూ ప్రశ్నిస్తున్న గొంతుకలను, నిర్బంధిస్తూ అక్రమ అరెస్టులతో ప్రభుత్వాన్ని నడపాలనుకుంటున్న తెలంగాణ ప్రభుత్వానికి వచ్చే ఎలక్షన్లలో ప్రజలే బుద్ధి చెప్తారు అని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కామారెడ్డి బహిరంగ సభలో డిక్లరేషన్‌లో భాగంగా ముదిరాజ్లకు బీసీ డీ నుండి బీసీఏ కి మారుస్తానని ,మధురాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తానని జాతి అభివృద్ధికి తోడ్పాటు అందిస్తానని చెప్పడం జరిగింది అని వివరించారు. కోకాపేట్ భూమిపై ఉన్న ట్రస్ట్‌ను రద్దు చేసి ముదిరాజ్ జాతికి అంకితం చేసి, ముదిరాజుల ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించి ఇవ్వాలని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నప్పటికీ, ముదిరాజ్ సామాజిక వర్గానికి న్యాయం చేయడంలో పూర్తిగా విఫలమైందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం నాయకులు బాలస్వామి, పిట్టల తిరుపతయ్య, కృష్ణయ్య, మండల సంఘం సభ్యులు గంగరమని శివ, గంట (నరసింహా), కావాలి కుమార్, కుందేళ్ళ రాజు, వెంకటేశు, జంగయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

## 80 గ్యాస్ సిలిండర్లు పట్టివేత



సిలిండర్లు స్వాధీనం చేసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

**దేవరకద్ర, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో గ్రామానికి చెందిన లక్ష్మణ్ అనే వ్యక్తి కమర్షియల్ సిలిండర్ వ్యాపారాలు చేస్తుండగా దాదాపు 80 సిలిండర్లను శుక్ర వారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. అక్రమంగా సిలిండర్లు వ్యాపారం చేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్ఐ శరత్ చంద్ర హెచ్చరించారు. ఈ దాడుల్లో రాజు, హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## కెమిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్యంపై ర్యాలీ

**గద్వాల ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** మన రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 11న హెల్త్ డే గా ప్రకటించడంతో జోగులాంబ గద్వాల జిల్లా కెమిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు ప్రజల ఆరోగ్యం పై ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులుఎం. సురేష్, ప్రధాన కార్యదర్శి వి కే కృష్ణ, కోశాధికారి పి. ప్రభాకర్ రెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమం లో భాగంగా మందుల సక్రమ వినియోగం హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్, వినియోగం పైన బాధ్యతాయుత మందుల సక్రమ పంపిణీ, సరైన లైసెన్స్ లు ఉన్నాయో లేవో పరిశీలించడం, నకిలీ మందులనివారణ, నాణ్యమైనమందులు అందించడం మొదలైన అంశాలపైప్రజలకు, కెమిస్ట్‌లకు అవగాహన కల్పించడానికిఅవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. శనివారం ఉదయం 8గంటలకు వైయస్సార్ చౌక్ నుండి కృష్ణవేణి చౌక్ వరకుర్యాలీ, అనంతరం అసోసియేషన్ భవనంలో డ్రగ్ ఇన్స్పెక్టర్ రఫీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నదన్నారు. కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్, డిఎంహెచ్ఓలు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లా లోని అన్నీ యూనిట్ల నుండి అత్యధిక సంఖ్యలో కెమిస్ట్‌లు పాల్గొని, ఈ అవగాహన కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా వారు కోరారు.

## యోగ మన జీవితంలో ఒక భాగం కావాలి

■ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు



యోగ చేస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగ రావు, అధికారులు

**గద్వాల ఏప్రిల్10, ప్రభాతవార్త:** ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకే కాక శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు యోగ దోహదపడుతున్నందున ప్రతి మనిషి జీవితంలో నిత్యం యోగ చేయడాన్ని ఒక భాగంగా చేసుకోవాలని అదనపు కలెక్టర్ నర్సింగ రావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల్లో శుక్రవారం ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో హోమియోపతి మరియు ఆయుష్ దినోత్సవ సంబరాల్లో ఉదయం గద్వాల ఐడిఓసి గార్డెన్ లో యోగ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశం ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప కానుక యోగ అని, అనేక దేశాల ప్రజలు యోగను సాధన చేస్తుండడం మనకెంతో గర్వకారణంఅన్నారు. యోగ ప్రాధాన్యతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా ఏటా అంతర్జాతీయ యోగ దినోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కలిగిస్తోందన్నారు. ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. యోగ శిక్షకులు తరచూ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరూ యోగను సాధన చేసేందుకు తమ వంతుగా కృషి చేయాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు. అనంతరం ఆరేళ్ల చిన్నారి రష్విక చేసిన సూర్య నమస్కారాలు, యోగసనాలు అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్‌రాజు, డిపిఓ శ్రీకాంత్, సర్వే ఏడినూకరాజు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుషిత, వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, జిల్లా పరిశ్రమలశాఖ మేనేజర్ రామలింగేశ్వరగౌడ్, యోగ శిక్షకులు, వైద్యాధికారులు, పలువురు వైద్యులు, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో నెలకొన్న సమస్యలపై అడిషనల్ కలెక్టర్ ఆరా



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాం ప్రసాద్ లాల్

**అచ్చంపేట, ఏప్రిల్, 10 ప్రభాతవార్త:** అయినోల్ గ్రామంలో శుక్రవారం అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాం ప్రసాద్ లాల్ పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఐనోల్ గ్రామ పంచాయతీని సందర్శించి గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతూ వారి సమస్యల గురించి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పురోగతిలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని వారు లబ్ధిదారులకు సూచించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడి రిజిస్టర్ లను తనిఖీ చేశారు. భోజన సామాగ్రిని నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ వారి అనుభవాలను ఈ పాఠశాల ద్వారా వారు నేర్చుకున్న విషయాలను తెలుసుకున్నారు. మధ్యాహ్నం విద్యార్థులతో కలిసిభోజనం చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశం, ఎంపీవో, డిఎల్‌పిఓ, ఈసీ, టెక్నికల్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్ పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవం



క్రీడలను ప్రారంభిస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.కొండయ్య

**మక్తల్ టౌన్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో క్రీడా పోటీలను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.కొండయ్య ప్రారంభించడం జరిగింది. కొండయ్య మాట్లాడుతూ భారతదేశంలోని అన్ని పార్లమెంటు నియోజక వర్గాల్లో ఈ యొక్క క్రీడా పోటీలను నిర్వహిస్తున్నమని తెలిపారు. గ్రామీణస్థాయి నుండి ప్రతిభను వెలికితీయాలని ఉద్దేశంతోనే ఈ యొక్క క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని క్రీడా పోటీల్లో పెద్ద ఎత్తున విద్యార్థులు, యువకులు, క్రీడాభిమానులుపాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా పాల్గొనీ ఈ క్రీడా పోటీలను మండల స్థాయిలో, నియోజకవర్గ స్థాయిలో, చివరగా పార్లమెంటు స్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ వెంకటేష్ ,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజశేఖర్ రెడ్డి, జిల్లా నాయకులు దేవర్ ఇంటి నరసింహారెడ్డి కల్లూరు నాగప్ప , కురువ హనుమంతు, కావలి వెంకటేష్, మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌నరసింహ, కౌన్సిలర్ కృష్ణ, మండల అధ్యక్షులు ప్రతాప రెడ్డి, జయానందరెడ్డి, నల్లెనరసప్ప, నారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శులు నరేందర్, టప్పఅశోక్, అశోక్ గౌడ్, మాజీ కౌన్సిలర్ నరసింహ, పట్టణనాయకులు విద్యాసాగర్, రాజశేఖర్, ఆంజనేయులు, మహదేవ్, రాకేష్, శ్రీధర్, బ్యాటరీ రాజు, చందాపూర్ రాము, కొండయ్య, నాగరాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణించాలి

పియూ వీసీ వైస్ ఛాన్సెలర్ శ్రీనివాస్



చెస్ ఆడుతున్న వీసీ శ్రీనివాస్

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీలో డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఇంటర్ డిపార్ట్మెంటల్ స్పోర్ట్స్ మీట్ ను 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా యూనివర్సిటీలోని విద్యార్థులకు ఇంటర్ డిపార్ట్మెంటల్ స్పోర్ట్స్ మీట్ 2026ను నిర్వహిస్తున్నారు. ఈ క్రీడలు శుక్రవారం చెస్, క్యారం పోటీలను విద్యార్థులకు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతి ప్రొ॥ జి. ఎన్. శ్రీనివాస్ హాజరై విద్యార్థులుచదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని అలాగే ఈ ఇంటర్ డిపార్ట్మెంటల్ టోర్నమెంట్‌లో భాగంగా క్రీడాకారులకు అందరికీ ఒక మంచి అవకాశం లభించి వారిలో ఉన్నటువంటి ప్రతిభను వెలికి తీసేందుకు ఈ క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని కొనియాడారు. రాబోవురోజుల్లో క్రీడల్లో అనేకరకాల సదుపాయాలు క్రీడాకారులు కల్పించి వారికి మంచి భవిష్యత్తు అందిస్తామని తెలిపారు. పాలమూరు యూని వర్సిటీ రిజిస్ట్రార్‌ప్రొ॥పూస రమేష్ బాబు, ఫిజికల్ డైరెక్టర్ డా. వై. శ్రీనివాసులు, సిబ్బంది, ఎం. శారద, మన్యం. అభిషేక్‌లతో పాటు అంపైర్లు కే శంకర్, వి వెంకటేష్, ఎస్ ప్రవీణ్ మహేష్‌లు పాల్గొన్నారు.

**గెలుపొందిన క్రీడాకారులు:** చెస్ పురుషుల విభాగంలో మొదటి బహుమతి ఎన్ శివరాజ్, రెండవ బహుమతి సి వెంకటేష్, క్యారమ్స్ పురుషుల విభాగంలో మొదటి బహుమతి పొలిటికల్ సైన్స్ బాలు, శరత్ కుమార్ రెండో బహుమతి బీటెక్ విభాగం గణేష్, ఖలీద్, షటిల్ బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో మొదటి బహుమతి బీఫార్మసీ విభాగం విష్ణువర్ధన్, అఖిల్, రెండో బహుమతిఇంగ్లీష్ డిపార్ట్మెంట్ మహిపాల్, మారుతి గెలుపొందారు. మహిళల లా విభాగం లో షటిల్ బ్యాట్మెంటన్ సౌజన్య, తేజశ్రీ, సింధు, రాఘవి గెలుపొందారు. చెస్‌విభాగంలో ప్రణవి, తేజశ్రీ, క్యారమ్స్ విభాగంలో అనురాధ, అంజలి, పల్లవి, ప్రణవి గెలుపొందినట్లు యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ డా. వై. శ్రీనివాసులు తెలిపారు.

## మేరా యువభారత్ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా సామాగ్రి అందజేస్తున్న దృశ్యం

**నారాయణపేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా ఉట్కూర్ మండల కేంద్రంలో మేరా యువభారత్ ఆధ్వర్యంలో యువ మండల్ వికాస్ అభియాన్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు యువజన సంఘాలకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అనిల్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ గ్రామ స్థాయి యువజన సంఘాలను మేరా యువభారత్‌తో అనుసంధానం చేయడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ అనుసంధానం ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు, ప్రోత్సాహం లభిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యూత్, గాంధీ యూత్, సర్దార్ నగర్ యూత్, పాత పేట్ యూత్, శ్రీనివాస యూత్, శివాజీ యూత్, లాల్ బహదూర్ యూత్ సంఘాలకు వాలీబాల్, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, ఫ్రిస్బీ, స్కిప్పింగ్ వంటి క్రీడా సామగ్రిని అందజేశారు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం గ్రామ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంలో కీలకంగా నిలుస్తోందని తెలిపారు. యువజన సంఘాలను బలోపేతం చేసి సామాజిక సేవా కార్యక్రమాల వైపు దారితీసే మంచి ప్రయత్నమని ప్రశంసించారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జగదీష్ గౌడ్ మాట్లాడుతూ యువత మద్యపానం, డ్రగ్స్ వంటి అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కృష్ణయ్య గౌడ్, శివరామరాజు, ఉప సర్పంచ్ రమేష్, సందాపురం రవి, కొండన్ గోపాల్, కొక్కు గౌతమ్, భానుచందర్, నరసింహ, కొక్కు మల్లేష్, నరేష్ గౌడ్, బండి అశోక్, గోవర్ధన్ గౌడ్, తరుణ్, హరి, రాజేష్, సుమన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభం




పీఎం సంసద్ ఖేల్ పోటీలు ప్రారంభించిన అధికారులు

**మద్దూరు, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** పీఎం సంసద్ ఖేల్ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా మద్దూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను మండల విద్యాధికారి బాలకిష్టప్ప ప్రారంభించగా కొడంగల్ నియోజకవర్గ కన్వీనర్ ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడమే పీఎం సంసద్ ఖేల్ ఉత్సవ్ లక్ష్యమని తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీలు క్రీడాకారులకు మంచి వేదికగా నిలుస్తాయని, అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే ఈ క్రీడా పోటీల నిర్వహణలో ఎంపీ అరుణమ్మ చేసిన కృషిని ప్రశంసిస్తూ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సవిత, ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సవిత, పీడీలు వెంకటప్ప, కతలప్ప, కృష్ణవేణి, పీఈటీలు బసంత్ రెడ్డి, రాజేష్, అలాగే మండల స్థాయి క్రీడా నిర్వాహకులు శంకర్, కేశవ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, తలారి సాయులు, రాజు గౌడ్, రాఘవేందర్, డికె.భరత్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## పాలమూరు ప్రజలు ఏం చెప్పినా వింటారు అనుకుంటే పొరపాటు హరీష్‌రావు

■ దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి



దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** గతంలో మీకు ఓట్లు వేసి అధికారంలోకి తీసుకువచ్చినా, జిల్లాను అభివృద్ధి చేయకుండా వెనుకబాటు తనానికి కారణమయ్యారు మీరు. కోయిల్ సాగర్, జూరాల, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు ఇవన్నీ ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కట్టిన ప్రాజెక్టులే. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో మీరు కట్టిన ప్రాజెక్టులు ఏవి అంటూ హరీష్ రావును దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. అదేవిధంగా ధరణి పేరుతో మీరు చేసిన భూ అరాచకాలు అన్ని ఇన్ని కావు, మీకు భూముల గురించి రైతుల గురించి మాట్లాడే అర్హత లేదు హరీష్‌రావు అన్నారు. దోచుకోవడం, దాచుకోవడం తెలిసిన మీకు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదు అని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మండిపడ్డారు.

## షీ ఫర్ స్టెమ్ విజయవంతం

గోల్డ్ మెడల్స్ ప్రైజ్ మనీ సంపాదించిన విద్యార్థులు



గోల్డ్ అవార్డులు సాదించిన విద్యార్థులు

**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** షీ ఫర్ స్టెమ్ తెలంగాణ స్టెల్లార్ స్కాలర్షిప్ టిజిటి డబ్ల్యుఆర్డీసీ అవార్డును తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.వాసంతి పిళ్ళై తెలిపారు. కళాశాలలో జరిగిన కల్పన షీఫర్ స్టెమ్ కార్యక్రమం విజయవంతంగా సాగిందని ఇందులో తమ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి ఐదు గోల్డ్ అవార్డ్స్, ప్రతి ఒక్క విద్యార్థికి పదివేల రూపాయలు క్యాష్ ప్రైస్ ను సాధించారని పేర్కొన్నారు. వీటితో పాటుగా కళాశాలకు రెండు లాప్టాప్స్ కూడా ప్రదానం చేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ బి. విజయ పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలు వద్దు.. ప్రభుత్వ పాఠశాలలు ముద్దు

■ పెద్దపల్లి సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి



**మల్దకల్ ఏప్రిల్10, ప్రభాతవార్త:** మల్దకల్ మండలంలోని పెద్దపల్లి గ్రామంలో ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం ఉపాధ్యాయులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అల్వాల శిరీష రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బడి బయట విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు.. ఈ సందర్భంగా సర్పంచ్ అల్వాల శిరీష మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు వద్దు ప్రభుత్వ పాఠశాలలు ముద్దుఖి అని నినాదంతో ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చదివించి ఉన్నత స్థాయికి ఎదిగే విధంగా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు... ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులుశిరీష, ఉపాధ్యాయులు జయలక్ష్మి, అంగన వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**మదనాపురం, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** మండలంలోని బౌసింగ్ తండా శివారులో పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడులు జరిపారు. సమీపంలో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ జగదీశ్వర్ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడిచేశారు. పేకాట ఆడుతున్న వారినుంచి రూ.10,800నగదు, సెల్‌ఫోన్లు,4 బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. గోపన్ పేట, బాలకిష్టాపురం గ్రామాలకు చెందిన పేకాట ఆడుతున్న వారిలో ఇద్దరు పరార్ కాగా అయిదుగురు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. పేకాట ఆడుతున్న వారి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మున్సిపల్ అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీలకు సన్మానం



**మద్దూర్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి, మద్దూర్ మునిసిపల్ అధ్యక్షుడు జీడి వెంకట్ రాములు, జనరల్ సెక్రటరీ కుదుగుంట నరసింహులు గౌడ్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ముద్ది భీములు, జనార్ధన్, రఘుపతి రెడ్డి, నిడ్జింత తిరుపతి రెడ్డి, కూని సంజీవ్, రమేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**కోయిలకొండ ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** కోయిల కొండ మండలం కొత్లాబాద్ గ్రామ జడ్.పి.హెచ్.ఎస్ ఉన్నత పాఠశాల1992.1993 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి పగిడియాల్ గ్రామానికి చెందిన ఎం నరసింహారెడ్డి ఇటీవలే కాలంలో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. విషయం తెలుసుకున్న పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు కలసి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎం నరసింహారెడ్డి స్వగ్రామానికి వెళ్లివారి కుటుంబాన్ని ఓదార్చుతూ ఆర్థిక సహాయం అందజేశారు. మీ కుటుంబానికి ఎల్లప్పుడూ మేము అండగా ఉంటామని భరోసా నిచ్చారు. ఆపద సమయంలో మమ్మల్ని ఆశ్రయించాలని వారు సూచించారు. స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం చేసినందుకు గ్రామస్తులు పూర్వపు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సురేందర్ రెడ్డి, రాజిరెడ్డి, సురేష్, బాలవర్ధన్‌రెడ్డి, అన్నపూర్ణ, మారుతిగౌడ్, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, విజయ్‌కుమార్, సత్తయ్య, సుగుణమ్మ,, కృష్ణయ్య, నర్సింలు, బుగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

SITUATION VACANT

★ ప్రముఖ IT Company లో పార్కింగ్ ఏరియాలో పని చేయుటకు గార్డ్స్ కావలెను. జీతం 24400 (ESI PF కలుపుకుని). 12 Shift. Call - 9030111563 (Ro.No.1250)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

# ఉత్తమ వీడియోకు రూ.5,000 నగదు బహుమతి

◆ అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతపై వీడియో పోటీలు

◆ ఈనెల 14 లోపు వీడియో పంపాలి : ఎస్పీ జానకి



**మహబూబ్‌నగర్ క్రైమ్, ఏప్రిల్ 10, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు అరైవ్ అలైవ్ అనే నినాదంతో జిల్లా పోలీసు శాఖ తరఫున వీడియో పోటీ నిర్వహించనున్నట్లు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకీ తెలిపారు. ఈ పోటీలో జిల్లాలోని ప్రజలు, విద్యార్థులు, యువత పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించడంతో పాటు రోడ్డు భద్రతపై సమాజంలో అవగాహన పెంపొందించేందుకు సహకరించాలని కోరారు. ఈ పోటీలో పాల్గొనదలచిన వారు రోడ్డు భద్రతకు సంబంధించిన సందేశంతో గరిష్టంగా 3 నిమిషాలుగల వీడియోను రూపొందించి, 14లోపు సాయంత్రం 5:00 గంటల లోపు మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పెన్ డ్రైవ్‌లో గాని లేదా ఐటిసెల్‌ఎంబిఎన్ఆర్ జి.మెయిల్.కామ్ మెయిల్ కి గానీ సమర్పించాలని సుంచించారు. ఈ పోటీలో ఉత్తమంగా ఎంపికైన వీడియోకురూ.5,000/నగదు బహుమతి అందజేయనున్నట్లు వెల్లడించారు. పూర్తి సమాచారం కోసం ఐటీ సెల్ ఎస్సై రవి సెల్: 8712659358 ని సంప్రదించాలని సూచించారు.

## జిల్లాకు మరింత గుర్తింపు తేవాలి

**ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ పార్లమెంటు కన్వీనర్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి**



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

**జడ్చర్ల, ఏప్రిల్ 10, ప్రభాతవార్త:** యువకులు క్రీడల్లో రాణించి మన జిలా్లకు మరింత గుర్తింపు తేవాలని ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ పార్లమెంటు కన్వీనర్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి ఆకాంక్షించారు. జడ్చర్ల పట్టణంలో డా.బిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ క్రీడ పోటీల్లో భాగంగా రెండవ రోజు క్రికెట్ వాలీబాల్ పోటీలను సంసద్ ఖేల్ పార్లమెంట్ ఇంచార్జ్ ముచర్ల జనార్దన్ రెడ్డి ప్రారంభించారు. రెండవరోజు అనేకమంది యువకులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అమర్నాథ్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, బుక్కనవీన్, శేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు రామ్ కళ్యాణ్, శ్రీదేవి, విజయ్ పాల్గొన్నారు.

## తెలంగాణ జాగృతి పార్టీలో కందెన్ పల్లి మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్ చేరిక



మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్‌కు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న తెలంగాణ జాగృతి నాయకురాలు కవిత

**దామరగిద్ద, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం కందెన్ పల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్ తెలంగాణ జాగృతి పార్టీలో అధికారికంగా చేరారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తెలంగాణ జాగృతి నాయకురాలు కవిత అక్క సమక్షంలో శ్రీనివాస్ గౌడ్‌కు పార్టీ కండువా కప్పి ఘనంగా ఆహ్వానించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, గ్రామస్థాయిలో మంచిగుర్తింపు కలిగిన నాయకుడు శ్రీనివాస్ గౌడ్ పార్టీలో చేరడం ఎంతో సంతోషకరమని తెలిపారు. ఆయన చేరికతో పార్టీ మరింతబలోపేతం అవుతుందని ఆశాభావంవ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ జాగృతి పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సేవ పట్ల పార్టీ కట్టుబాటు తనను ఆకర్షించాయని చెప్పారు. గ్రామఅభివృద్ధి, యువతకు అవకాశాలు కల్పించడం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీతో కలిసి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ ఇచ్చే బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని శ్రీనివాస్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధికి ఆయన సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు.

## మెనూ ప్రకారం పిల్లలకు, గర్భిణీలకు మంచి ఆహారాన్ని అందించాలి

◆ 10వ వార్డు కౌన్సిలర్ బోరెల్లి మహేష్



అంగన్‌వాడీలో గుడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**కొల్లాపూర్, ఏప్రిల్ 10 ప్రభతావార్త :** కొల్లాపూర్ మున్సిపల్ 10వ వార్డులోని జమాన్ గడ్డ కాలనీలోని 2వ అంగన్‌వాడీ సెంటర్ ని 10వవార్డు కౌన్సిలర్ బోరెల్లి మహేష్ సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన అన్నప్రాసన కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు అన్నప్రాసన చేయడం జరిగింది. వారు అంగన్‌వాడి కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. రికార్డులో పిల్లల సమాచారాన్ని గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న బాలమృతం, పాలు, గుడ్లు సకాలంలో అందిస్తున్నారా లేదా అని, మెనూ ప్రకారంగా పిల్లలకు గర్భిణీ స్త్రీలకు ఆహారాన్ని అందించాలని అంగన్‌వాడి టీచర్ కు సూచించారు. అనంతరం సిడిపిఓతో ఫోన్లో మాట్లాడి అంగన్‌వాడి కేంద్రంలో ఫ్యాను సదుపాయాన్ని కల్పించాలని వేసవికాలం అవ్వడంతో విద్యార్థులు కూర్చునేందుకు చాలా ఇబ్బందిగా ఉందనివీలైనంత త్వరగా 2వ అంగన్‌వాడి సెంటర్లో సీలింగ్ ఫ్యాన్‌ని ఏర్పాటు చేయాలని సూచించారు. వార్డుకి చెందిన గర్భిణీ స్త్రీలకు అందించే గుడ్లు పాలు బాలామృతాన్ని కౌన్సిలర్ బోరెల్లి మహేష్ అంగన్‌వాడి టీచర్లతో కలిసి పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బోరెల్లి మహేష్ తో పాటుగా మొట్టె శివకుమార్ , షఫీ, అంగన్‌వాడి టీచర్ హుస్సేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణ తెలంగాణ కేంద్ర బిందువు మహబూబ్‌నగర్

**మొదటి పేజీ తరువాయి భాగం..**



రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహాకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ ఖుష్బూ గుప్తా

ఏదో సంబంధం ఉందని ఆయన చెప్పారు. తాను గతంలో ఎమ్మెల్యేగా, డికె అరుణ మంత్రిగా ఉండేవారు ఆ సమయంలో మెడికల్ కాలేజ్ అవసరాన్ని పలు మార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆ సమయంలో సంబంధిత మంత్రిత్వ శాఖతో చర్చలు జరిపి, ప్రపోజల్స్‌ను ముందుకు తీసుకెళ్లడంలో నాడు విద్యాశాఖ మంత్రిగా ఉన్న దామోదర రాజనర్సింహ కీలక పాత్ర ఉందని వివరించారు. మంత్రి చొరవతోనే మహబూబ్‌నగర్‌లో మెడికల్ కాలేజ్ ఆసుపత్రి ఏర్పాటుకు దారి తీసిందని, దీంతో స్థానిక ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. మహబూబ్‌నగర్ ప్రాంత అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న మంత్రికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల కోసం హెల్త్ స్క్రీనింగ్ పైలెట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన రాష్ట్ర వైద్యఆరోగ్య మంత్రి. అనంతరం మంత్రి దామోదర రాజనరసింహ పాత పాలమూరు లోని అర్బన్‌ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల సభ్యుల కోసం హెల్త్ స్క్రీనింగ్ పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో మహబూబ్‌నగర్ రూరల్, భూత్పూర్, చిన్నచింతకుంట, దేవరకద్ర, హన్వాడఐదు మండలాలలోని మహిళా స్వయం సహాయక సభ్యులకు 30 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వారియొక్క హెల్త్ ప్రొఫైల్ ను తయారు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంగ్తు, జిల్లా కలెక్టర్ ఖుష్బుగుప్తా, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మేయర్ గుమ్మాల మమత, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జెఎల్‌బి హరిప్రియ, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.రంగ అజ్మీర, 45వ డివిజన్ కార్పొరేటర్ సల్మాన్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, సాదతుల్లా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కె కృష్ణ, డిఆర్‌డిఓ నర్సింహులు పాల్గొన్నారు.

# స్వయం ప్రతిపత్తితో కొత్త కోర్సులు



వివరాలు వెల్లడిస్తున్న ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్

**మహబూబ్‌గర్, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పి.జి కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో 2026,27 విద్యా సంవత్సరానికి డిగ్రీ) కోర్సులలో ప్రవేశాల ప్రక్రియ ఇంటర్ ఫలితాలు వెలువడిన వెంటనే దోస్త్ పక్రి)య (ప్రారంభమోతుందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్. వి. రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కళాశాలలో పలు అప్రెంటిస్ షిప్ ఎంబెడెడ్ ప్రోగ్రాం లోభాగంగానే బి.ఎస్.ఎస్.ఐ (బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్), మరియు హెల్త్ కేర్ మేనేజ్మెంట్ వంటికొత్త కోర్సులను ప్రవేశపెడుతూ ముఖ్యంగా ఫిజికల్ సైన్స్, ఆర్ట్స్ కామర్స్ విభాగాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ఆధునిక విద్యావిధానంతో బోధన జరుగుతుందని తెలుపుతూ అలాగే నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెంచేవిధంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కెరీర్ గైడెన్స్ సెల్ ద్వారా సివిల్ సర్వీస్ ఫౌండేషన్ బి.సి స్టడీ సర్కిల్ వారు ఉచితంగా అందించారు. అలాగే డిగ్రీ పూర్తయిన వెంటనే దానికి అవసరమైన బోధన కొరకు హైద్రాబాద్ నుండి నిష్ణాతులైన భోదన సిబ్బందితో బ్యాంకింగ్ సర్వీసెస్ మన శాసన సభ్యులైన యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దేశ్పాండే పౌండేషన్ వారిచే నైపుణ్యాభివృద్ధిగల స్టూడెంట్ ను చేర్చుకాని వారికి ట్రైనింగ్ ఇవ్వగా దాదాపు 16 మందికి ఉద్యోగాలు వచ్చాయి. ఈ సంవత్సరం కూడా ఎమ్మెల్యే పౌండేషన్ ఖర్చులు భరించి ఆ కోర్సులను విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నారు. జాబ్ మేళా నిర్వహిస్తూ ఇందులో 355 మంది పాల్గొనగా 150 మంది ప్లేస్మెంట్స్ సాధించారు. ఈ సంవత్సరం సెక్టార్ స్కిల్ కోర్సులు మంజూరయ్యాయి. వీటిద్వారా, విద్యార్థులు కళాశాలలో విద్య నభ్యసిస్తూ చివరి సంవత్సరంలో 9వేల నుండి 18 వేల వరకు స్టైఫండ్ అప్రెంటిస్ షిప్‌గా వస్తుంది. డిగ్రీ సర్టిఫికెట్‌తో ఇండస్ట్రీ వారు ఉద్యోగాలు ఇస్తారు, అప్రెంటిస్ షిప్ ద్వారా స్కిల్స్ నేర్చుకుంటారు. ఏ.ఈ.డి.పి కోర్సులలో విద్యార్థులు ఎక్కువమంది అడ్మిషన్స్ పొందాలని, ఆశిస్తూ ఈ సంవత్సరం మూడు పి.జి. కోర్సులైన తెలుగు, కెమిస్ట్రీ, జువాలజీతోపాటు 2026.27 సంవత్సరంలో మ్యాథ్స్ ను కూడా అందిస్తామని తెలిపారు. గత సంవత్సరం డిగ్రీ ప్రథమ సంవత్సరంలో 1440 సీట్లకుగాను 1245 సీట్లు పూర్తికావడం కావడం జరిగింది కాని ఈ సంవత్సరం 1440 సీట్లు మొత్తం పూర్తి చేస్తామని తెలిపారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు, మంచి మౌలిక వసతులు, లైబ్రరీ, ల్యాబ్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలుపుతూ ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినులు ఇంటర్ ఫలితాలు వెలువడిన వెంటనే దోస్త్ ద్వారా కాని మరియు కళాశాలలో నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ అమీన ముంతాజ్ జహాన్, వైస్ ప్రిన్సిపాల్ డా.పద్మ అనురాధ, సుధాకర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్, మద్దిలేటి పాల్గొన్నారు.

# అరైవ్ అలైవ్‌తో జిల్లాలో రోడ్డు భద్రతపై వారం రోజుల ఉద్యమం

◆ గద్వాల జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు



**గద్వాల ఏప్రిల్ 10,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అమలవుతున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా, జోగులాంబ గద్వాల జిల్లాలో రోడ్డు భద్రతపై భారీ స్థాయిలో చైతన్యం తీసుకు రావడానికి ఏప్రిల్ 13 నుంచి 18 వరకు "అరైవ్ అలైవ్".. కార్యక్రమాన్ని అన్ని గ్రామ సభల్లో నిర్వహించాలని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు పోలీస్ అధికారు లును ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకు పెరుగుతున్న ఈ పరిస్థితుల్లో, "ఒక్క నిర్లక్ష్యం –ఒక కుటుంబం నాశనం"అనే కఠిన సత్యాన్ని గుర్తుచేస్తూ, ప్రతి పౌరుడిలో బాధ్యతాభావం పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ ఆరు రోజుల కార్యక్రమంలో గ్రామ స్థాయిలో రోడ్ సేఫ్టీ కమిటీల ఏర్పాటు నుంచి ప్రారంభమై, ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడం, అంబేద్కర్ జయంతి సందర్భంగా ట్రాఫిక్ నియమాలను పాటించేందుకు ప్రమాణం చేయించడం, ప్రమాదాలకు గురయ్యే ప్రదేశాలను గుర్తించి తగిన చర్యలు చేపట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించబడతా యన్నారు. అలాగే, రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ప్రాణాలను కాపాడే "గోల్డెన్ అవర్" ప్రాముఖ్యతపై పోలీస్, అంబులెన్స్ సిబ్బంది, వాలంటీర్లకు శిక్షణ ఇచ్చి అత్యవసర పరిస్థితుల్లో సమయానికి స్పందించే విధంగా సిద్ధం చేస్తున్నారు. చివరి రోజైన జీరో ఎన్ఫోర్స్‌మెంట్ డేలో ఉల్లంఘనదారులకు కౌన్సె లింగ్ నిర్వహించి, శిక్ష కన్నా అవగాహన ద్వారా మార్పు తీసుకురావడమే లక్ష్యంగాచర్యలు చేపడతారు. స్కూల్ పరిసరాల్లో ప్రత్యేక భద్రతా చర్యలు, జీబ్రా క్రాసింగ్‌లు, స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేయడం ద్వారా చిన్నారుల ప్రాణ భద్రతకు ప్రాధాన్యత ఇస్తారు. "హెల్మెట్ ఒక అలవాటు కాదు – అది ప్రాణ రక్షణ కవచం.. సీట్‌బెల్ట్ ఒక నియమం కాదు – అది కుటుంబానికి ఇచ్చేహామీ"అని పేర్కొన్నారు. ప్రతి యువకుడు తనడ్రైవింగ్‌ను మార్చుకుంటేనే సమాజం మారుతుందని, ప్రతి గ్రామం సురక్షితంగా మారితేనే జిల్లా సురక్షితం అవుతుందన్నారు. స్పీడ్ తగ్గించు – జీవితం కాపాడు, "జాగ్రత్తగా నడప–సురక్షితంగా చేరుకో" అనేసందేశంతో ఈ అరైవ్ అలైవ్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఇందులో చెప్పే బాధ్యత సంబంధమైన విషయాలను ప్రతి ఒక్కరూ పాటించాలని జిల్లా ఎస్పీ తెలిపారు.

## మేఘాన్న అభయస్తం ద్వారా మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం




అభయ హస్తం ద్వారా ఐదు వేల రూపాయలను అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**రేవల్లి, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** ఏదుల మండలం చెన్నారం గ్రామం చెందిన ఉప్పరి బాలయ్య (60) సంవత్సరాలు ఆరోగ్యం బాగాలేక చనిపోవడం జరిగింది. ఈ విషయాన్ని చెన్నారం గ్రామ కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు ఏదుల మండలం కాంగ్రెస్ నాయకులు సుఖేందర్ రెడ్డి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డికి తెలియజేశారు. అభయస్తం ద్వారా చనిపోయిన ఉప్పరి బాలయ్యకుటుంబానికి రూ.5,000లు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. కార్యక్రమంలో బందెల శ్రీనివాస్ రెడ్డి, బుద్ధం శ్రీకాంత్ రెడ్డి, గుంటి సురేందర్, మిద్దె కుర్వ కరుణాకర్, 11 వార్డ్ నంబర్ బంకల గిరిబాబు, 12 వార్డ్ సభ్యులు దంజనేయులు, ఆవుల పవన్ కుమార్, బంకల రాములు, దోల్ రామ్, పాశం వెంకట్ స్వామి, పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో కొనసాగుతున్న అభివృద్ధి పనులు

**ఉప్పునుంతల, ఏప్రిల్10 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతలలో గ్రామ సర్పంచ్ చింతగాళ్ళ శ్రీనివాసులు ఆధ్వర్యంలో టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. బిసి కాలనీ తూర్పు 10 వ వార్డులో నెలకొన్న సమస్యలను గుర్తించి శ్వాశతపరిష్కారం కోసంఎమ్మెల్యే సహకారంతో పనులు చేపట్టారు. ఆ వార్డులో ఎన్నో సంవత్సరాలుగా వర్షాకాలంలో నడవడానికి వీలు లేకుండా ఏర్పడిన రోడ్డు మరమ్మతు చేపట్టారు. దీంతో 10 వ వార్డు వాసులు స్థానిక ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ కు, ఉప్పునుంతల గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు కు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



10వ వార్డులో వేగవంతంగా కొనసాగుతున్న రోడ్డు మరమ్మతు పనులు

## నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనుల పరిశీలన



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ ఉపేందర్ రెడ్డి

**దేవరకద్ర, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలం పేరూరు గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పనులను శుక్రవారం హౌసింగ్ పీడీ ఉపేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ పనులలో నాణ్యత పై ఏ మాత్రం రాజీ పడకుండా, ప్రతి దశలో పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం అవసరమైన ఇసుక, మట్టిని, లబ్ధిదారులకు అందజేయాలన్నారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కొత్త అరవింద్ కుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## మహా మండపం నిర్మాణానికై స్థల పరిశీలన

**చిన్న చింతకుంట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వరుడి ప్రతిరూపంగా కొలవబడుతున్న శ్రీ కురుమూర్తి స్వామి ప్రధాన ఆలయంలో అర్థ మండపం, మహా మండపం నిర్మాణం కోసం దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ ఇంజనీర్ శ్రీనివాస శర్మ, ఏ.ఈ రణ్వీత్‌లు శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఇటీవల మహా మండప నిర్మాణానికి దాతలు ముందుకు రావడంతో నిర్మాణానికై అధికారులు స్థల పరిశీలన చేయడంపై భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలు అమావాస్య సందర్భాలలో భక్తులు క్యూ లైన్ లలో ఇబ్బందులకు గురవుతుండడంతో దీన్ని దృష్టిలో ఉంచుకొని భక్తుల కోసం మూడు అంతస్తుల వరకు క్యూ కాంప్లెక్స్ నిర్మాణం చేయాలని అధికారులు తెలిపారు. త్వరలోనే దేవాదాయ ధర్మాదాయ శాఖ స్థపతి తో ప్లాన్ అంచనా తయారు చేస్తామని అధికారులు తెలిపారు. వీరి వెంట ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి, ఆలయ అర్చకులు, సిబ్బంది ,భక్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ జానకి, హాజరైన పోలీస్ అధికారులు

## వేగవంతమైన స్పందన కీలకం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

పరిస్థితుల్లో సమయానికి స్పందించే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు. శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, క్రమశిక్షణ వంటి లక్షణాలు పోలీసు సిబ్బందికి అత్యవసరమని, ఈ శిక్షణ వాటిని మరింత మెరుగుపరుస్తుందని తెలిపారు. అలాగే, ఆయుధ వినియోగం, డ్రిల్, సమూహంగా పని చేయడం, నాయకత్వ లక్షణాలపెంపుదల వంటి అంశాలలో సిబ్బంది నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. పోలీసు శాఖ ప్రతిష్టను కాపాడే విధంగా ప్రతి సిబ్బంది కట్టుబడి పని చేయాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా సేవలందించాలని ఆదేశించారు. ఈ శిక్షణ ద్వారా సిబ్బందిఅత్యవసర పరిస్థితుల్లో సమన్వయంతో పనిచేసే నైపుణ్యాన్ని సాధించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్ అందరూ ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలను మేయర్ మమత, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్‌రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఉపాధి అవకాశాల కోసం రవాణా సౌకర్యం కీలకం అని, దివ్యాంగుల జీవన ప్రమాణాల మెరుగుదల లక్ష్యంగా కార్యక్రమాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు. స్కూటీలుఅందుకున్న లబ్ధిదారుల ఆనందం వ్యక్తం చేసి, విప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## గద్వాల జిల్లాలో ఆరెంజ్ అలర్ట్

**మొదటి పేజీ తరువాయి భాగం..**

మధ్యాహ్నం 4గంటల మధ్య ఎండలో బయటకు వెళ్లకూడదని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు ఇంట్లోనే నీడ పట్టున ఉండాలన్నారు. హీట్ వేవ్ కారణంగా వికారం, వాంతులు, వేడిగా మరియు పొడిగా ఉన్న చర్మం, శరీర ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ (104ఏ) వరకు పెరగడం, తీవ్రమైన తలనొప్పి, తల తిరగడం, మూర్ఛ, కండరాల బలహీనత, గుండె వేగంగా కొట్టుకోవడం, వేగంగా శ్వాస తీసుకోవడం వంటి లక్షణాలు కనిపించవచ్చని తెలిపారు. అలాగే "గందరగోళం, ఆందోళన, అసహనం, అసమతుల్యత, ఫిట్స్, కోమా వంటి మానసిక మార్పులు కూడా కలగవచ్చని పేర్కొన్నారు. ఈ లక్షణాలలో ఏవైనా కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందాలని సూచించారు. పని ప్రదేశంలో యజమానులు తమ కార్మికుల కోసం చల్లనితాగునీరు, ఇతర అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. అదనపు కార్మికులను తీసుకుని ఉన్న కార్మికులపై పని భారాన్ని తగ్గించవచ్చన్నారు. గర్భిణీ కార్మికులు, అనారోగ్యంతో ఉన్న కార్మికులు వేడిలో పనిచేయడం గురించి వైద్యులతో చర్చించాలన్నారు. అస్వస్థతకు గురైన వారికి అవసరమైన వైద్య సేవలు అందించాలన్నారు. వడదెబ్బ తగిలిన వారిని చల్లని ప్రదేశానికి తీసుకెళ్లి, నీటితో శరీరాన్ని తుడవాలన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తులకు చికిత్స అందించేందుకు 108 కు ఫోన్ చేయవచ్చన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తరపున సంబంధిత శాఖల అధికారులు వైద్య సేవలు అందిస్తారన్నారు. జిల్లావాసులు ఈ సలహాలు, సూచనలను పాటించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు.

## ప్రశాంతంగా వేలం పాటలు



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

**దేవరకద్ర, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలో శుక్రవారం జరిగిన గొర్రెల మేకల సంత వేలం పాటలు ప్రశాంతంగా జరిగినట్లు మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు తెలిపారు. ఈ సంతకు రీ టెండర్ వేయగా ప్రభుత్వ అప్సెట్ ప్రైజ్ ధర రూ. 16,9000/ లకు గాను గ్రామానికి చెందిన కటికె రామోజీ అనే వ్యక్తి రూ. 16 లక్షల 97 వేలకు పాట పాడి గొర్రెల మేకల సంతను దక్కించుకున్నారు. మొత్తం మీద ఈ వేలం పాటలు అరగంటలోనే ముగించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు, సీత నాయక్, కౌన్సిలర్లు, వేలం పాటదారులు, ఈవేలం పాటలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ఎస్ఐ నాగన్న పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## అతిపెద్ద క్రీడా వేడుక సంసద్ ఖేల్..

**రెండో రోజు కొనసాగిన సంసద్ ఖేల్ పోటీలు**



**నవాబ్‌పేట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త :** ప్రధానమంత్రి అతిపెద్ద క్రీడా వేడుకలో రెండో రోజు ఎన్మనగండ్ల ఉన్నత పాఠశాలలో కబడ్డీ వాలీబాల్ క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వాలీబాల్‌లో మరికల్, ఇప్పటూరు ఫైనల్‌కు చేరుకున్నాయి. కబడ్డీ విభాగంలో మరికల్ కాకర్లపాడు ఫైనల్ కు చేరుకున్నాయి. క్రికెట్ తదితర క్రీడలు నేడు ప్రారంభం కానున్నాయని సంసద్ ఖేల్ క్రీడా పోటీల ఆర్గనైజర్స్ మండల బిజెపి తెలిపారు. కార్యక్రమానికి సంసద్ ఖేల్ జడ్చర్ల నియోజకవర్గం ఇంచార్జ్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, యువ నాయకులు డీకే అర్జున్ రెడ్డి పాల్గొననున్నారు. శుక్రవారం జరిగిన కార్యక్రమం మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ ప్రధాన కార్యదర్శి గణేష్ చారి ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ నెంబర్ శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శి గణేష్ చారి, కోశాధికారి రవి, మండల ఉపాధ్యక్షులు విటల్ మండల సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, బూత్ అధ్యక్షులు ఆవుల శేఖర్, బస్వరాజ్, వార్డ్ నెంబర్ సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు వినోద్ కుమార్, నాగరాజు, గాయత్రి, అధిక మొత్తంలో క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొనడం జరిగింది.

## ఎన్ఎంఎంఎస్ యాప్‌పై కూలీలకు అవగాహన

**చిన్న చింతకుంట, ఏప్రిల్ 10 ప్రభాతవార్త:** ఉపాధి హామీ పనులలో ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా కేంద్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను తీసుకొచ్చింది. శుక్రవారం ఉంద్యాల గ్రామంలో ఎంపీడీవో లక్ష్మీ నర్సింలు ఉపాధి కూలీలకు ఎన్ఎంఎంఎస్ యాప్ పై అవగాహన కల్పించారు. ఉపాధి పనులకు వెళ్లే కూలీలు ఈ యాప్‌లో కూలి ముఖాన్ని అప్‌లోడ్ చేస్తేనే కూలీడబ్బులు వస్తాయని ఎంపీడీవో తెలిపారు. ప్రతి ఉపాధి కూలీ ఎన్ఎంఎంఎస్‌లో తప్పనిసరిగా తమ ముఖాన్నిఅప్‌లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, కూలీలు పాల్గొన్నారు.